# ఘటాశార్ధం - కేశఖండనం

పిశిపాటి వెంకట రమణయ్యగారు

వరాహనుకోట హైస్కూలు మా మేనమామగారి అగ్రహారానికి మైలుండేది. ప్రొద్దున్నే లేచి మా అమ్మమ్మ పెట్టే పెరుగన్నం మాగాయముక్కసహాయంతో కుత్తికబంటిదాక మెక్కి తోడిపిల్లలతో ఆడుకొంటూ, పాడుకొంటూ చెరువుగట్టు ఆచెట్లమధ్యన్నే పడ్డామంటే మా లేతకాళ్లకు మైలు గిమీలు వోలెక్కలో వుండేది కాదు. ఏడుగంటలకల్లా స్కూలుకు హాజరు. తిరిగి పదకొండుగంటలకు యింటికి వచ్చామంటే ఆ పెరుగన్నం మాగాయ యెక్కడ మాయమయ్యేవో గాని రెపరెపమంటుండేది. కాసేపు ఆడుకొనో, చదువుకొనో తిరిగి రెండుగంటలకు బయలుదేరామంటే సాయంకాలం అయిదింటికి వచ్చేసేవాండ్లం. సెలవలరోజుల్లో తప్ప యేయెండా యేవాన మా యీనిత్యకార్యక్రమానికి అడ్డం వచ్చేవే కావు.

ఈడు ముదిరి పైక్లాసుల్లో చదివేవాళ్ల సంగతి వదిలేసి మాసరకారులో చదివేవాళ్లందరిలోకి నేను మహా తెలివైనవాణ్ణని అగ్రహారంలోని ఆడవాండ్లంతా అనుకొనేవారు. వాండ్లపిల్లలనందరిని చదువుకోడానికి మాయింటికి పొమ్మనంటుండేవారు. మా అమ్మమ్మకు ఇదో గర్వకారణం కూడాను. అప్పుడప్పుడు సగర్వంగా వాండ్లను బెదిరిస్తూకూడా వుండేది.

సత్యం నాక్లాసే చదువుతుండేవాడు. నాకన్నా కాస్త పుష్టిగా వుండేవాడు. వట్టి అమాయకుడు. కాస్త మందమతి. మాయిద్దరికి యెడబాటనేదే వుండేది కాదు. సీతారామయ్యగారు ఆఅగ్రహారంలో సగభాగస్వామి. మంచిపలుకుబడి గలవారు. ఈకారణంచేత సత్యాన్ని చూస్తేమాత్రం మాఅమ్మమ్మ యేమీ అనేదికాదు. పైగా సీతారామయ్యగారు తనకొడుకు చదువువిషయమై కాస్త హెచ్చరించడానికి అప్పుడప్పుడు మాయింటికి వచ్చి మాట్లాడిపోతూ మంచిచెడ్డ విచారిస్తూవుండేవారు. వారల్లా పేదవాండ్లిండ్లకు రావడమే గొప్పను కొనేది మాఅమ్మమ్మ. విశాలాక్షి సీతారామయ్యగారి మొదటి సంబంధపు కుమార్తె. పదిహేడు- పద్దెనిమిదేండ్లుంటా యనుకుంటాను. సత్యం నాయీడువాడే; పన్నెండేండ్లుంటాయి. ద్వితీయసంబంధానికి, ఈకొడుకు, ఇంకో చంటిబిడ్డ. సీతారామయ్యగారిల్లు అదో సత్రం. వచ్చే పొయ్యే వాండ్ల సంగతి వోలెక్కే లేదు. పైగా యిటువైపు బలగం, అటువైపు బలగం యెప్పుడు యింటి నిండా వుండేవారు. వ్రతాలని, పూజలని యేదో శుభకార్యం తరుచు జరుగుచునేవుండేవి. ఇక నా కాయింట్లో అడ్డే వుండేదికాదు. ఏకారణంచేతైనా ఓరోజు వెళ్లడం తటస్థించకపోయినా యేపిండివంటైనా దాచిపెట్టి నన్ను పిలిపించి మరీ పెట్టేది విశాలాక్షి. తమ్ముడికన్నా నన్ను మాస్తే మహాప్రేమగా వుండేది మావిశాలాక్షి వదినె.

ఆరోజు జార్జి కారనేషన్ డే. మమ్మల నందర్ని తల దువ్వుకోని నీట్‌గా డ్రెస్సువేసికొని రమ్మన్నారు. క్లాసులో ఫస్టున్నవారికి, స్పోర్ట్సులో జయమొందిన వారికి కేశవపిళ్ల డిప్యూటికలెక్టరుగారిచే బహుమానాలిప్పిస్తారని, అందరికీ మిఠాయి పంచిపెడతారనీ ముందుగానే చెప్పేశారు. ఆరాత్రి సత్యం, నేను విశాలాక్షిగారింట్లోనే పడుకొన్నాము. విశాలాక్షి చీకటితోనే లేపింది మమ్మలిద్దరిని. నీళ్లు పోసింది. తల దువ్వింది. బొట్టు పెట్టింది. శుభ్రమైనబట్టలు తొడిగించింది. మమ్మల నిద్దరిని ముద్దుపెట్టుకొని, 'మిఠాయిపొట్లాలు తెచ్చి పెడతారు కదూ' అంది. ఇనుమడించిన ఉత్సాహంతో యిద్దరము వెళ్లాము ఆరోజు స్కూలుకు, బహుమానాలన్నీ తెచ్చి ముందు వదినెకు చూపించాలని. సత్యంమాత్రం "సగం మిఠాయి మనం తిందాం. మిగతాది అక్కయ్యకిస్తాం" అని, అల్ప సంతోషి, గుటకలు మ్రింగుతూవచ్చాడు స్కూలుకు.

వాటికని, వీటికని నాకో గిల్లురూపాయ పట్టు త్రాడు గట్టిన పతకంతోసహా, అనం దేలుడిక్షణరీలంత లావున్న ఆరుపుస్తకాలు బహుమతులొచ్చాయి. పిల్లలు మొయ్యలేరన్న సంగతన్నా తోచలేదు గావల్ను, పిళ్లగారికి. మూడుపుస్తకాలు సత్యం నెత్తికెత్తాను. మూడు నానెత్తిన పెట్టుకొన్నాను. చక్రవర్తిగారు సింహాసన మెక్కిన బరువుభారాలు పిళ్లగారు చూచాయగా ఆరోజే యెరుకపర్చినట్లయింది, మాయిద్దరిపని వాటి నింటికి మోసేటప్పటికి. దారిపొడుగూత సత్యానికి మిఠాయిపొట్లం సగం తిని మరీ వెళ్లదామన్న గొడవే తప్ప రెండో గొడ వేదీ లేదు, అమాయకుడికి. విశాలాక్షి దారి చూస్తూ నిలుచుంది. ఎవరో సత్యం మోస్తున్న పుస్తకాలు సత్యాని కిచ్చారని, నేను మోస్తున్న పుస్తకాలు నా కిచ్చారని ఊహించినట్టుంటే, "కాదు,పందెం, అన్నీ ప్రసాదానివే" అని వాదించిందట. చివరకు తనపందెమే గెలిచిందని గర్వించి నవ్విన ఆముఖవిలాసం నాలేత హృదయంలో పాతుకొనిపోయింది.

ఇలా కొంతకాలం జరిగింది. పైక్లాసులో చదువుచూ పెద్దకారులో చేరిన గడుగ్గాయరెకం, యెందుకో నన్ను చూచి వేళాకోళాలు చేస్తుండేవారు. నాదారిన నేను మాసత్యం స్కూలుకు వెళ్లుతుంటే వెనకాలతే యీగడుగ్గాయరెకంలో యెవరో వోరు వచ్చి నావీపు మీద తట్టి "ఏమోయ్ సంప్రదహాసా" అంటుండేవారు. నాకేమీ అర్థమయ్యేది కాదు. మా పెద్దవాళ్లు పెట్టిన ప్రసాదరావు పేరుకన్నా యీ పేరు బాగున్నదని పించినా, వాండ్లత్రోవా తెరువు పోక నాదారిన్నే నేను పోతుంటే వెనకాలే వచ్చి వీపు చరచడం మాత్రం నాకు కోపకారణ మయ్యేది. అయితేమాత్రం యేం చెయ్యడం? వాళ్లు పెద్దవాండ్లు. గడేకాళ్లు. మరేమన్నా అంటే ఓచెంపపెట్టుపెట్టినా వాండ్ల నడిగే వారే లేరు. పైగా నిత్యము వాండ్లత్రోవనే స్కూలుకు వెళ్లక తప్పదు.

ఆరోజు మహాశివరాత్రి. మా అగ్రహారంలోని పరమేశ్వరాలయం ఆచుట్టుపట్ల గ్రామాదులకంతా ప్రఖ్యాతి. గ్రామాదులనుండి జనం విరగబడ్డారు. నేను, సత్యం విశాలాక్షితోకూడా గుడికి వెళ్లాము. బాగా చీకటి పడింది. విశాలాక్షి యెందుకో బెదరినలేడిలా సత్యం భుజంమీద ఓచెయ్యి, నాభుజంమీద ఓ చెయ్యి వేసికొని గబగబ యింటికి నడవడం ప్రారంభించింది. ఇంతలోకే నన్ని రెండుమూడురాళ్లు మానెత్తిన పడ్డాయి. అటువైపు యిటువైపు తిరిగిచూస్తే నన్ను పరాచకం చేస్తూ వుండే యిద్దరుముగ్గురు కూడి యీరాళ్లు విసిరినట్లు తెలిసింది. విశాలాక్షి యెటువైపుకూడ చూడకే యింటికి చేరింది. ఈవిషయం సీతారామయ్యగారికి తెలిపితే వాండ్లను డొక్క చీలేస్తారని నాకు బాగా ధైర్యముంది కాని విశాలాక్షి యెందుచేతనో నన్ను నివారించింది.

ఇలా కొంతకాలం జరిగింది. క్రమేణ నాకు ఊహకూడా తెలుస్తూవచ్చింది. విశాలాక్షిని గుంటూరులో యిచ్చినట్టు, యుక్తవయస్కురాలయి నాలుగైదేండ్లయినా వివాహసమయంలో వరకట్న మిచ్చినట్లే యిప్పుడు తిరిగి యేవెయ్యో, రెండువేలో తను బియ్యేల్ పట్టభద్రుడు కావలచడంచేత, యిస్తేనే కాని పిలుచుకొనివెళ్లనన్నాడట పెనిమిటి, వెంకట్రావు. సీతారామయ్యగారికి యిది కేవలం దౌర్జన్యవ్యవహారంగా కనిపించి, యిష్టముంటే పిలుచుకొనివెళ్లండి, లేకుంటే మాపిల్ల మాయింటనే వుంటుందని జబాబు చెప్పినారట. నాలుగైదేండ్లు గడవడమే కాకుండా, అక్కడత్తగారు వాండ్లు లేనిపోనిపేర్లు పెట్టడంచేత, ఇక్కడింటివద్ద నలుగురికి సమాధానం చెప్పలేక, చివరకు వారిపంతమే నెగ్గేటట్టు వారు కోరిన కట్నం యిచ్చి, విశాలాక్షిని గుంటూరుకు పంపివేసినారు. అది మొదలు మద్రాసులో లా చదవడానికనివెళ్లిన వెంకట్రావు సీతారామయ్యగారిని నెల నెలకు కొంతడబ్బు పంపమని వ్రాసేవుత్తరాలకు యెడ తెరపే లేదు. అందొకవుత్తరం నేను చూడడంకూడ తటస్థించింది. ఆ బి. ఏ. విజ్ఞానం, కాబోయ్యే బి. యల్. పరిజ్ఞానము అందీవిధంగా వెలిగించాడు: "మీరు మొన్న ఇచ్చిన డబ్బును మా నాన్నా వారలు యిదివరలో నా చదువు కోసం చేసిన అప్పు క్రింద కట్టివేశారు. నన్నింతటితో చదువు మానుకోమంటే యిష్టం

లేక మీకుమార్తె సౌఖ్యంకొరకు, బి. యల్. కూడ ప్యాసుకాదలచినాను. ఈ కష్టమంతా మీ కుమార్తెను సౌఖ్యపెట్టదలచే పడుచున్నాను గనుక వెంటనే డబ్బుపంపవలసినది. లేకుంటే మీపిల్లను మీరు పిలుచుకొనిపోవచ్చును. పంపివేయమని మావాండ్లకుకూడ వ్రాయుచున్నాను." అని వుంది. సీతారామయ్యగారే అయితే యేం చేసేవారో కాని, యీ పట్టు వరలక్ష్మమ్మగారు (ద్వితీయభార్య) గట్టిగా అడ్డు తగిలారు. ఈకథ యిలానడుస్తుండగా మా స్కూల్ ఫైనల్ రిజల్ట్సు కూడ వచ్చినవి. ఇంతవరకూ యెలాగో నెట్టుకొని వచ్చినా, యీపరీక్ష సత్యం ఫెయిలవడంవల్ల మా కిద్దరికి యెడబాటు కలుగవలసివచ్చింది. కాలేజి కోర్సుకు నేనుకూడ గుంటూరికే వెళ్లవలసివచ్చింది.

నిత్యము కాలేజినుండి రాగానే విశాలాక్షిని చూచి వస్తుండేవాడిని. రాజభోగంగా పెరిగిన విశాలాక్షి పాట్లు నాకు చాలా జాలి కలిగించింది. అత్త మామ మరుదులు అంతా భోజనంచేసినతరువాత దూరంగా దొడ్డివాకిటిముందు యింతఅన్నం పడేసేవారు, నిత్యము, విశాలాక్షికి. ఉదయాన్నే లేవడం, దొడ్డి, వాకిలి వూడ్చి నీళ్లు చల్లడం, యిల్లలకడము, బట్ట లుతకడం, అంట్లు తోమడం, పిడకలు తట్టడం యీపనులతో సరిపోతుండేది రోజంతాను. అంట్లు తోమిపెట్టిన తరువాత, కాసిని నీళ్లు చల్లి మరీ ముట్టుకొనేవారట. విశాలాక్షి యిదంతా తనపూర్వకర్మఫలమని, ఏకష్టసుఖమైనా తనత్తగారింట తాను పడి అనుభవించవలసినదే కాని, యింకోరికి చెప్పుకొనడం సాధ్విలక్షణం కాదనే భావంతో వుండేది. నిత్యము నేను వెళ్లిచూచి మాట్లాడి వస్తుంటే తల్లి తోబుట్టువులతో మాట్లాడినట్లు ఓదారేది. నేను మాట్లాడుచున్నంతసేపు అత్తగారటువైపన్నా వచ్చేదికాదు. విశాలాక్షిని పిలిచేది కాదు.

సీతారామయ్యగారికి విశాలాక్షి పడేకష్టాలన్నీ వ్రాయడమే కాకుండా, స్వయంగా కూడ వెళ్లినప్పుడు చెప్పినప్పటికి 'ఇంతటికి దానికర్మం యెవరంమాత్రం యేమి చేయగలం' అని మూభావంగా వూరుకొన్నారు. వరలక్ష్మమ్మగారిచేతిలో కీలుబొమ్మలాఅయిపోయినారు.

వెంకట్రావు బి. యల్. పరీక్ష పూర్తిజేసుకొని, యింటికి వచ్చాడు. రాగానే తల్లిదండ్రు లేమి చెప్పినారో కాని యింట్లోనుండి వెళ్లగొట్టినారు. పైగా యిరుగుపొరుగువారితో నాకును, విశాలాక్షికిని గల స్నేహవిషయమై, మాఅగ్రహారంలో వుండేటప్పుడే యెవరో వ్రాసినట్లున్నా, దానికి తోడు అత్తగారిల్లని భయమన్నా లేకుండా నేను నిత్యం వచ్చి మాట్లాడిపోవడం కారణంగా నిరూపించారట. ఎన్నికష్టాలకో యీరెండు వత్సరాలు వోర్చుకొంది విశాలాక్షి. పండువంటి శరీరకాంతి పాండువుతేలింది. అయినప్పటికిని, అటు తల్లిదండ్రులను కాని, యిటు అత్తమామలను కాని పల్లెత్తుమాటనినది కాదు. చిన్నప్పటినుండి తల్లిలా ఆదరిస్తుండేది నన్ను. తనతమ్ముడిమీదకూడ అంతప్రేమగా వుండేది కాదు. 'పాపం తల్లి లేనిపిల్లవా'డని యెన్నిపర్యాయములో యెత్తి ముద్దుపెట్టుకొనేది. తనను మగడు వెళ్లిపొమ్మన్నది మాయీస్నేహకారణమని విన్నప్పటినుండి, ఆశాంతస్వరూపిణి, అమాయకురాలు, ఒక్కుమ్మడి ఉగ్రురాలయిపోయినది. ఈప్రపంచములో యెవరిలెక్క తనకు లేదన్నట్టయిపోయినది. పైనున్న నగలన్నిటిని అమ్మి, అక్కడనే ఓయిల్లు కిరాయికి తీసికొని నిలిచిపోయింది. వకీలుగారికిది కొంతచిన్నతన మనిపించింది. భార్యకును తనకును ఏలాటిసంబంధము లేదని ప్రపంచానికి తెలిపి ద్వితీయవివాహ ప్రయత్నం చేసికోడానికి ఘటాశ్రాద్ధం పెట్టేశారు. విశాలాక్షికి యీసంగతి తెలిసింది. నదురు లేదు, బెదురు లేదు. వెంటనే వెంకట్రావు కోఉత్తరం వ్రాసిపంపింది: "మీరు ద్వితీయవివాహమునకై అడ్డు రాగలదను ఉద్దేశముతోటి ఘటాశ్రాద్ధకర్మ జరిపినట్లు తెలిసింది. అంతమాత్రంతోటి మీమనోభీష్టత పూర్తిగా నెరవేరిందనుకొనను. ఈపట్టున మీకోరిక పూర్తిగా నెరవేర్పదలచి రేపటిరోజున నాకేశఖండనకర్మకూడ జరిపించదలచినాను. మీరు ద్వితీయవివాహమాడి సుఖులై యుందురుగాక" అని.

ఘటాశ్రాద్ధానికి తయారైనటువంటిబ్రాహ్మలే కేశఖండనకర్మ జరిపించుటకుకూడ సిద్ధమైనారు. సక్రమంగా కర్మజరిగిపోయింది. ఎక్కడికిపోయినా విశాలాక్షి పట్టెడువిభూతి, తను ప్రత్యక్షం, పాపం, మనవెంకట్రావుకు.